28 నుంచి యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

కడ్తాల్/కందుకూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర ఆరోగ్య విద్య, వైజ్ఞానిక మహాసభలు ఈనెల 28, 29, 30 తేదీల్లో నల్గొండలో నిర్వహిస్తామని ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు గోపాల్‌నాయక్ తెలిపారు. సోమవారం కడ్తాల జెడ్పీ బాలుర పాఠశాలలో సన్నాహక సమావేశాన్ని నిర్వహించారు. మహాసభల కరపత్రాలు, పోస్టర్లను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అలాగే కందుకూరు మండల కేంద్రంలో యూటీఎఫ్ మహాసభల పోస్టర్లను నాయకుడు గోపాల్ ఆవిష్కరించారు. బాలుర పాఠశాలలో సమావేశం నిర్వహించారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

ప్రజావాణికి ఫిర్యాదుల వెల్లువ

రంగారెడ్డి అర్బన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ప్రజలు వివిధ సమస్యలతో బాలురు తీరారు. కలెక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదులు అందజేసి విన్నవించారు. మొత్తం 92 మంది వివిధ శాఖలకు ఫిర్యాదు చేశారు. అందులో రెవెన్యూశాఖ 57, హౌజింగ్ 19, పంచాయతీ 7, లోకల్ బాడీస్ 3, ఎంపీడీవో, వైద్యశాఖకు ఒక్కోటి, ఇతర ఫిర్యాదులు ఉన్నాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్, తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

హైటెన్షన్ లైన్‌ను ఏర్పాటు చేయొద్దు

కడ్తాల్ : మండల కేంద్రం సమీపంలో సాగు చేసుకుంటున్న పంట పొలాల మీదుగా విద్యుత్ హైటెన్షన్ లైన్ ఏర్పాటు చేయకుండా చూడాలని గ్రామ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కడారి రామకృష్ణలు కలెక్టర్ నారాయణరెడ్డిని కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. బీదర్ నుంచి మహేశ్వరం వరకు పవర్ గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న 765 కేవీ విద్యుత్ లైన్‌ను పంట పొలాల మీదుగా ఏర్పాటు చేయడం వల్ల రైతులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడుతారని నాయకులు కలెక్టర్‌కు వివరించారు. పోల్ సర్వే మార్కింగ్‌ను నిలిపివేయించాలని కోరారు. విద్యుత్ లైన్ ఏర్పాటుకు సంబంధించిన కాంట్రాక్టర్ రైతులకు, పట్టాదారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా లైన్ ఏర్పాటు చేశారని, పవర్‌గ్రిడ్ అధికారులతో మాట్లాడి రైతులకు మేలు చేయాలని కలెక్టర్‌ను కోరినట్లు జీఎల్ఎస్ రెడ్డి, రామకృష్ణలు తెలిపారు. నాయకులు ఎగిరిశెట్టి గాంధీ, పెంటారెడ్డి, జంగయ్య, నర్సింహ, జంగారెడ్డి, బోసు రవి, అభిషేక్‌రెడ్డి, శివరాజ్, తదితరులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

సమాజానికి సైన్స్ ఎంతో అవసరం

కందుకూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సమాజానికి సైన్స ఎంతో అవసరమని, జీవశాస్త్రంలో నైపుణ్యాన్ని పెంపొందించుకొని శాస్త్రవేత్తలుగా, డాక్టర్లుగా ఎదగొచ్చని జిల్లాసైన్స్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. కందుకూరులోని బాలుర పాఠశాలలో జీవశాస్త్రంపై టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. 14 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. హెచ్‌ఎంలు అంజయ్య, గోవర్ధన్‌రెడ్డి, రవి, సైన్స్ టీచర్లు భక్యానాయక్, మణిమాల, శ్రీనివాస్, శాంతకుమారి, రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. కాగా మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌లో విజేతలను ఎంఈవో నర్సింహ అభినందించారు. వీరు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు.



పదో తరగతి విద్యార్థులపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా వందరోజుల ప్రత్యేక ప్రణాళిక తయారు చేసింది. ఈమేరకు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు విద్యాశాఖ ఉపాధ్యాయులకు మార్గదర్శకాలు జారీ చేసింది. మెరుగైన ఫలితాల సాధన, పరీక్షలంటే భయం పోగొట్టడం, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు రాబట్టడమే లక్ష్యంగా పెట్టుకుంది. ఈమేరకు ఉన్నత పాఠశాలల్లో రెండో శనివారంతో పాటు ఆదివారాల్లో కూడా ప్రత్యేక తరగతులు, స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు.


చేవెళ్ల, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించడంలో పదో తరగతి ఎంతో కీలకం. టెన్త్ ఫలితాలపైనే వారి భవితవ్యం ఆధారపడి ఉంటుంది. దాంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పదో తరగతి పరీక్షలకు ఎంతో ప్రాధాన్యమిస్తారు. ఈ నేపథ్యంలో మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ వంద రోజుల కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఒక ప్రణాళిక ప్రకారం మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రతీనెల రెండో శనివారం, ఆదివారం సైతం అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక తరగతుల్లో భాగంగా చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించడంతో పాటు మిగిలిన వారు ఉత్తమ మార్కులు సాధించేలా దృష్టి సారిస్తున్నారు. విద్యార్థుల అభ్యసన స్థాయి పెరగడంతో పాటు వారిలో ఆత్మస్థైర్యం పెంపొందించడానికి ఈ ప్రణాళిక దోహదపడుతుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా మొత్తం 248 ఉన్నత పాఠశాలల్లో 62,900 మంది విద్యార్థులున్నారు. వచ్చే ఏడాది పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించాలనే ఉద్దేశంతో నవంబరు నుంచి మార్చి వరకు వంద రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నారు. సబ్జెక్టులవారిగా టీచర్లు విద్యార్థులకు ప్రత్యేక సూచనలు ఇస్తున్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పదో తరగతి పబ్లిక్ పరీక్షల తేదీలు ఇటీవల ప్రభుత్వం ఖరారు చేసింది. 2025 మార్చి 21 నుంచి ఏప్రిల్ 4వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఇటీవల విడుదల చేశారు. గతంలో వచ్చిన ఫలితాలను బేరీజు వేసుకొని మరింత మెరుగైన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. సబ్జెక్టు వారీగా విద్యార్థులకు అసైన్‌మెంట్

- మిగతా 8వ పేజీలో..



చేవెళ్ల మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులను చదివిస్తున్న ఉపాధ్యాయులు

క్రిస్మస్‌కు చర్చిల ముస్తాబు



విద్యుద్దీపాలతో ముస్తాబు చేసిన ఫాతిమా మాత చర్చి

కొత్తూర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీతో పాటు, మండలంలోని వివిధ గ్రామాల్లో క్రిస్మస్‌ను పురస్కరించుకొని నిర్వాహకులు చర్చిలను రంగురంగుల విద్యుద్దీపాలతో సర్వంగా సుందరంగా ముస్తాబు చేశారు. రేపు క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



క్రికెట్ టోర్నీలో క్రీడాకారులు

జేపీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

శంషాబాద్ రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తొండుపల్లి ఎంపీఎస్ క్రీడా మైదానంలో సోమవారం తెలంగాణ జూనియర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. మొత్తం 8 జిల్లాల(ఆదిలాబాద్, ఆర్మూర్, తాండూర్, మహబూబ్‌నగర్, నిర్మల్, రంగారెడ్డి, హైదరాబాద్, నాందేడ్) జట్లు పాల్గొన్నాయి. 11వ వార్డు కౌన్సిలర్ పారెపల్లి లావణ్యశ్రీనివాస్‌గౌడ్, పీఎస్ డెవలపర్స్ వేణుమాధవరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, పరమేశ్‌గౌడ్, పి.ప్రవీణ్‌గౌడ్, కొండ ప్రవీణ్‌గౌడ్, బంగారం కుమార్, బి.పున్నారెడ్డి, అమిత్ డొకోవత్ ఏకే47 ఫోర్స్, ఎంఎస్ స్పోర్ట్స్ కె.సురేందర్‌ల సహకారంతో టోర్నీని నిర్వహించారు. పెంటయ్య, దర్శన్, అశోక్, విశ్వనాథం, శంకర్, రమేశ్, రాజు పాల్గొన్నారు.

పంటల రక్షణకు సోలార్ ఫెన్సింగ్



- తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం
- తగ్గిన వన్యప్రాణుల బెడద
- సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వానికి రైతుల వినతి

8

సైన్స్‌ఫేర్‌తో సృజనాత్మకత వెలికితీత

- విద్యార్థులు విజ్ఞానంపై పట్టు సాధించాలి
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- షాబాద్ మండలం నాగర్‌గూడలో సైన్స్‌ఫేర్
- ఆకట్టుకున్న విద్యార్థుల ప్రయోగాలు

7

బీఆర్ఎస్ పాలనలో విధ్వంసం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల్లో పర్యటన
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



7

అర్హులందరికీ ఇళ్లు నిర్మిస్తాం

- ఇండ్ల సర్వేలో ఎవరికీ లంచాలివ్వొద్దు
- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
- నందిగామ మండలం బండకుంట తండాలో గృహలక్ష్మి సర్వే

7





ధ్యాన మహాయాగంలో ధ్యానులు

ధ్యానంతో ఆత్మజ్ఞానం

- ధ్యాన గురువు పరిణతి పత్రీజీ
- కొనసాగుతున్న ధ్యాన మహాయాగం వేడుకలు
- తెలుగు రాష్ట్రాల నుంచి తరలివస్తున్న ధ్యానులు
- ఆకట్టుకున్న కళాకారుల నృత్య ప్రదర్శనలు
- ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ



కడ్తాల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ధ్యాన సాధన చేసి ఆత్మజ్ఞానం పొందిన వారు మానసిక భయాలు వీడి మనో ధైర్యంతో ఆనందమయ జీవితాన్ని పొందుతారని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీస్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా సభ్యురాలు, దివంగత బ్రహ్మర్షి సుభాష్ పత్రీజీ కుమార్తె పరిణతి పత్రీజీ అన్నారు. శ్వాస మీద ధ్యాసతోనే వ్యక్తికి పరిపూర్ణత లభిస్తుందని.. అది ధ్యానం ద్వారా సిద్ధిస్తుందని తెలిపారు. కడ్తాల మండలం అన్మాస్‌పల్లి మహేశ్వర మహాపిరమిడ్‌లో కొనసాగుతున్న ధ్యాన మహాయాగం వేడుకల్లో భాగంగా మూడోరోజు సోమవారం పరిణతి పత్రీజీ పాల్గొని ధ్యానులనుద్దేశించి మాట్లాడారు. పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ధ్యానం ద్వారా జ్ఞానం, సంస్కారం సిద్ధించి వ్యక్తి ఉన్నతికి దోహదపడుతుందన్నారు. మహేశ్వర మహాపిరమిడ్ కేంద్రంగా పత్రీజీ ప్రారంభించిన ధ్యాన విప్లవాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు ధ్యానులు, పిరమిడ్ మాస్టర్లు కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు.

అట్టహాసంగా వేడుకలు

అన్మాస్‌పల్లి గ్రామ సమీపంలోని కైలాసపురి మహేశ్వర మహాపిరమిడ్‌లో పత్రీజీ ధ్యాన మహాయాగం వేడుకలు-3 అట్టహాసంగా కొనసాగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల నుంచి వేడుకలకు ధ్యానులు, సాధకులు, సందర్శకులు, పిరమిడ్ మాస్టర్లు, ఆధ్యాత్మికవేత్తలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. పలు దేశాలకు చెందిన ధ్యానులు, ఆధ్యాత్మికవేత్తలు పాల్గొని తమ ధ్యాన అనుభవాలను వివరిస్తున్నారు. పత్రీజీ శక్తిస్థల్‌ను శోభాయమానంగా అలంకరించారు. ధ్యాన మహాయాగంలో భాగంగా సోమవారం తెల్లవారుజామున 5గంటలకు ధ్యాన మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం యోగా మాస్టర్ వెంకటేశ్‌చే యోగా శిక్షణ, చైతన్య తేజల ఆధ్వర్యంలో వేద పఠనం, వేణునాథ, సంగీత కళాకారులు గణేశ్, సంజయ్‌కింగ్ బృందాలచే సంగీతనాద ధ్యానం కార్యక్రమాలు నిర్వహించారు. ధ్యాన గురువు పత్రీజీ వేణునాద సంగీత ధ్యాన వీడియోలను సరస్వతి ప్రాంగణంలోని సభావేదికపై నుంచి వీడియో ద్వారా ప్రదర్శించారు. సంగీత విద్వాంసుల సంగీత ధ్యానం అమితంగా ఆకట్టుకుంది. పలువురు పిరమిడ్ మాస్టర్లు, ఆధ్యాత్మికవేత్తలు, ట్రస్ట్ సభ్యులు ధ్యానులనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా

- మిగతా 7వ పేజీలో..

భూములిచ్చిన రైతులకు ఇళ్ల పట్టాలిస్తాం

మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి



మీర్ఖాన్‌పేట రైతులతో మాట్లాడుతున్న కేఎల్లార్

కందుకూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ముచ్చర్లలో నెలకొల్పే ఫోర్త్ సిటీకి భూములిచ్చిన రైతులందరికీ ఎకరానికి ఒక గుంట చొప్పున ఇంటి స్థలం ఇస్తామని మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి తెలిపారు. సోమవారం వంద మంది మీర్ఖాన్‌పేట రైతులు తుక్కుగూడలోని క్యాంప్ కార్యాలయంలో లక్ష్మారెడ్డిని కలిసి సమస్యలను వివరించారు. వారితో కేఎల్లార్ మాట్లాడుతూ.. మీర్ఖాన్‌పేట 112సర్వే నంబరులో 844 ఎకరాలను ప్రభుత్వం సేకరించిందన్నారు. అయితే ఇంకా 86 ఎకరాల విస్తీర్ణానికి రైతులకు పరిహారం ఇవ్వలేదని రైతులు చెబుతున్నారని తెలిపారు. అసైన్డ్‌భూములు కోల్పోయిన రైతులకు ఇంటి స్థలాల పట్టాలిస్తామని భరోసా ఇచ్చారు. గ్రీన్‌ఫార్మసిటీకి భూములిచ్చిన రైతులకు ఇప్పటికే మీర్ఖాన్‌పేట, పంజగూడ, తిమ్మాయపల్లి పరిధిలో 600 ఎకరాల్లో హెచ్‌ఎండీఏ లేఅవుట్లలో ప్లాట్లను ఇస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే రైతులకు ప్లాట్ల డాక్యుమెంట్లు ఇస్తామన్నారు. అలాగే పరిహారం అందని మీర్ఖాన్‌పేట రైతుల వివరాలపై అధికారులతో మాట్లాడి 86 ఎకరాలకు పరిహారం, ప్లాట్లు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు జంగారెడ్డి, మాజీ జడ్పీటీసీ బి.జంగారెడ్డి, ఎ.సత్యనారాయణ, కె.మధన్‌పాల్‌రెడ్డి, డి.నర్సింహ, బి.బాల్‌రాజ్, పి.శంకర్, జంగయ్య, డి.విష్ణు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

కన్హా శాంతివనానికి రేపు ఉప రాష్ట్రపతి రాక

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొననున్న జగదీప్ ధన్కడ్

నందిగామ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కడ్ రేపు(బుధవారం) రంగారెడ్డి జిల్లా నందిగామ మండల పరిధిలోని కన్హా శాంతివనానికి రానున్నట్లు కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం కన్హా శాంతివనంలో ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉప రాష్ట్రపతి ఈనెల 25, 26న కన్హా శాంతివనంలో నిర్వహించే ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొననున్న తెలిపారు. ఎలాంటి లోటుపాట్లు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీసీపీ ఎల్సీ నాయక్, అడిషనల్ డీసీపీ రామ్‌కుమార్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అమరరాజా బ్యాటరీస్ బిల్డింగ్‌లో అగ్ని ప్రమాదం

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఘటన
- మంటలార్పిన ఫైర్ సిబ్బంది
- తప్పిన ప్రాణనష్టం

శంషాబాద్ రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ విమానాశ్రయంలో సోమవారం సాయంత్రం అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు, ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎయిర్‌పోర్టులోని నోవాటెల్ హోటల్ ఎదురుగా ఉన్న అమర రాజా బ్యాటరీస్ కంపెనీ బిల్డింగ్ నిర్మాణం జరుగుతోంది. నాలుగో అంతస్తులో వెల్డింగ్ మిషన్ కిందపడి ప్లైవుడ్‌కు మంటలంటుకున్నాయి. అప్రమత్తమైన సిబ్బంది ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని మంటలార్పాయి. కాగా, ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగలేదని ఎయిర్‌పోర్టు వర్గాలు పేర్కొన్నాయి. అగ్ని ప్రమాదంపై ఫిర్యాదేమీ రాలేదని ఆర్జీఐఏ పోలీసులు తెలిపారు.



అమర రాజా బిల్డింగ్‌లో ఎగసిపడుతున్న మంటలు

53వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

తలకొండపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఏర్పాటు కోసం గట్టిప్పలపల్లి వాసులు చేస్తున్న రిలే నిరహార దీక్షలు సోమవారంతో 53వ రోజుకు చేరాయి. జేఏసీ ఆద్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వెంకట్రావుపేట, గౌరిపల్లి, ఖానాపూర్, చౌదర్‌పల్లి, బల్సులపల్లి తండా, మెదక్‌పల్లి, వీరన్నపల్లి, కేపీ తండాలతో గట్టిప్పలపల్లిని మండల కేం ద్రం చేయాలని వారు డిమాండ్ చేశారు. తలకొండపల్లి మండల కేంద్రం తమకు దూరంగా ఉందని, వచ్చీ పోయేందుకు ప్రజలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని వాపోయారు. ప్రభుత్వం కొత్త మండలాన్ని వెంటనే ప్రకటించాలని ప్రజలు, నాయకులు డిమాండ్ చేశారు. దీక్షలో ఆంజనేయులు, ఈదమయ్య, జంగయ్య, చెన్నయ్య, నాగయ్య, చంద్రయ్య కూర్చున్నారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

- రేపు స్వామివారి కల్యాణం.. ఎల్లుండి రథోత్సవం
- కేశంపేట మండలం వేముల్‌నర్వ శివారు నంబయ్య గట్టుపై ఏర్పాట్లు


ఉత్సవాలకు ముస్తాబైన వేణుగోపాలస్వామి ఆలయం

కేశంపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వేముల్‌నర్వ గ్రామ శివారు నంబయ్య గట్టుపై వెలసిన వేణుగోపాల స్వామి ఆలయం బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. నేడు(మంగళవారం) ఆలయంలో వేడుకలు ప్రారంభం కానున్నాయి. ప్రతీయేటా ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్దఎత్తున తరలివస్తుంటారు. ఈ సందర్భంగా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు వైద్యసేవలు అందించనున్నారు. పోలీసులు సీసీ కెమెరాలతో ఉత్సవాలను పర్యవేక్షించనున్నారు. కేశంపేట సీఐ నరహరి నేతృత్వంలో భారీ బందోబస్తు నిర్వహించనున్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని గట్టు కింద ఇప్పటికే మిఠాయి, ఇతర దుకాణాలు వెలిశాయి. రేపటి(మంగళవారం) నుంచి శనివారం వరకు బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. మంగళవారం అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. బుధవారం రాధారుక్మిణీ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం, గురువారం తెల్లవారుజామున గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి వేణుగోపాల స్వామి ఆలయం వరకు రథోత్సవం, శుక్రవారం ప్రభల మహోత్సవం, శనివారం చక్రతీర్థం, స్వామి అలంకరణతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. కల్యాణానికి షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరువుతారని తెలిపారు. ఉత్సవాలకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

ఘనంగా రైతు దినోత్సవాలు



ఆమనగల్లు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి):ఆమనగల్లులోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో సోమవారం రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. చైర్‌పర్సన్ యాట గీత ఆధ్వర్యంలో రైతులు, కమిటీ డైరెక్టర్లు కేక్ కట్‌చేసి పంచారు. కాంగ్రెస్ పాలన అంటేనే రైతు సంక్షేమ పాలన అన్నారు. లక్షలాది మంది రైతులకు రుణమాఫీ చేసి వారి ఆర్థిక భారాన్ని దించిన ఘనత సీఎం రేవంత్ రెడ్డికే దక్కిందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్లు వస్సుల శ్రీశైలం, రమేశ్ గౌడ్, సంపత్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్, శ్రీకాంత్, శ్రీను పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రోత్సాహం అభినందనీయం



మేడ్చల్ టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాలనీల్లో ఆటల పోటీలు నిర్వహించి క్రీడల్లో ప్రోత్సహించడం అభినందనీయమని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ నైబర్ హుడ్ కాలనీలో సొసైటీ వారు గత 45 రోజుల పాటు నిర్వహించిన ఆటల పోటీల విజేతలకు ఆదివారం రాత్రి బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఆయన మాట్లాడారు. 45రోజుల పాటు కాలనీ వాసులు ఆటల పోటీలు నిర్వహించి ఇతర కాలనీలకు ఆదర్శంగా నిలిచారన్నారు. చాలా వరకు గేటెడ్ కమ్యూనిటీల్లో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించటం అరుదన్నారు. ఈ కార్యక్రమంలో సిర్పూర్ కాగజ్‌నగర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్, స్థానిక కౌన్సిలర్ అమరం సరస్వతి, దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, బీజేపీ నియోజకవర్గం కన్వీనర్ అమరం మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు


పనుల నేపథ్యంలో యాంగ్లర్స్‌పై ఉంచిన ట్రాన్స్‌ఫార్మర్

కొత్తూర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కొత్తూర్‌లోని పోచమ్మ కాలనీకి వెళ్లే దారిలో ఉన్న ఫెన్సింగ్ లేని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ట్రాన్స్‌కో అధికారులు మరమ్మతులను ప్రారంభించారు. 'కంచె లేక ప్రాణాలు హరీ' అనే శీర్షికతో ఈ నెల 20న ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ట్రాన్స్‌ఫార్మర్ చేతికందే ఎత్తులోనే ఉండడంతో ఎప్పుడు షాక్ కొడుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ఎత్తు పెంచేందుకు పనులు చేపట్టారు. దీనిపై ఏఈ రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా ట్రాన్స్‌ఫార్మర్ గద్దె ఎత్తును ఆరుఫీట్లకు పెంచుతున్నట్లు తెలిపారు. రెండు రోజుల్లో గద్దె కట్టడం పూర్తి చేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను దానిపైన ఫిక్స్ చేస్తామని చెప్పారు.

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలి

ఘట్‌కేసర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ టాస్క్ మేనేజర్ ప్రదీప్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని కొండాపూర్‌లో గల సంస్కృతి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూట్‌లో , ఎడ్యునెట్ ఫౌండేషన్, తెలంగాణ అకాడమి ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఎస్‌ఏపీ ల్యాబ్స్ ఉన్నతి కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. హైదరాబాద్‌లోని 200కళాశాలలుండగా సంస్కృతి కళాశాలలో ఈకేంద్రం ఏర్పాటుకు ఎంపిక చేయడం పట్ల కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ మల్లాడి రమాకాంత్‌రెడ్డి హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో ఎడ్యునెట్ ప్రోగ్రామ్ మేనేజర్ మొహ్మద్ పాషా, టాస్క్ రిలేషన్ మేనేజర్ నరేష్, ఆయా విభాగాల ప్రిన్సిపల్స్ జానకిరాములు, శివకేశవ రెడ్డి, శశిధర్, అరుణ్‌రెడ్డి పోతిరెడ్డి, నీలంసింగ్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంల రాత పరీక్షను రద్దు చేయాలి

తాండూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్ట్ ఏఎన్‌ఎంలకు రాత పరీక్షను రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలు సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సీఐటీయూ


ప్రారంభోత్సవంలో టాస్క్ మేనేజర్ ప్రదీప్‌రెడ్డి విద్యార్థులు

ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలు ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. 30సంవత్సరాల నుంచి గ్రామాల్లో, పీహెచ్‌సీలో, ప్రభుత్వ ఆస్పత్రిలో రాత్రింబవళ్లు చాలీచాలని జీతాలతో పనిచేస్తే రాత పరీక్ష ద్వారా సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తామని అనడమేంటని వాపోయారు. రాతపరీక్ష లేకుండా క్రమబద్ధీకరించాలని వారు డిమాండ్ చేశారు. రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్స్, పింఛన్ సౌకర్యం కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి రాత పరీక్షలు వెంటనే రద్దు చేయాలని వారు కోరారు. లేదంటే తమ ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లీలావతి, కార్యదర్శి వెంకటమ్మ, కమిటీ సభ్యులు మల్లమ్మ, వై.దేవి, పుష్ప, కవిత, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ మందాకు పరామర్శ


మందా జగన్నాథాన్ని పరామర్శిస్తున్న గోలి శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథాన్ని సోమవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ జంగయ్య పరామర్శించారు. జగన్నాథం అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్నాడు. ఆసుపత్రిలో వారు పరామర్శించారు. ఆరోగ్యపరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మందా జగన్నాథం కూతురు పల్లవితో మాట్లాడి మనోధైర్యాన్ని కల్పించారు.

అంబులెన్స్‌లో ప్రసవం


అంబులెన్స్‌లో క్షేమంగా తల్లీబిడ్డతో కుటుంబీకులు, వైద్య సిబ్బంది

బషీరాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పురిటినొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణిని ఆస్పత్రికి తరలిస్తుండగా అంబులెన్స్‌లో పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటన మండలంలోని మర్పల్లి శివారులో సోమవారం చోటుచేసుకుంది. మండలంలోని ఇస్మాయిల్‌పూర్ తండాకు చెందిన జ్యోతిబాయికి పురిటినొప్పులు రావడంతో కుటుంబీకులు 108అంబులెన్స్‌కు ఫోన్‌చేశారు. అంబులెన్స్‌లో తాండూరులోని మాతా శిశు, ఆరోగ్య కేంద్రానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మర్పల్లి శివారులోకి రాగానే నొప్పులు అధికమయ్యాయి. పైలట్ మహేష్ వాహనాన్ని నిలపడంతో ఈఎంటీ నర్సింహులు డెలివరీ చేశారు. కాగా పుట్టిన బిడ్డ మెడకు బొడ్డుతాడు చుట్టి అడ్డుగా వచ్చి డెలివరీ క్రిటికల్‌గా మారగా వైద్యుల సూచన మేరకు ఈఎంటీ చాకచక్యంగా వ్యవహరిస్తూ డెలివరీని విజయవంతం చేశారు. తల్లి, బిడ్డా క్షేమంగా ఉన్నారని వారన్నారు.

సైన్స్‌ఫేర్‌తో విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికితీత


విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

షాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విజ్ఞాన ప్రదర్శనలతో విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికి వస్తుందని, వారి మేధస్సు పెంపొందుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కె.యాదయ్య అన్నారు. నాగర్‌గూడలోని అక్షర టాలెంట్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన సైన్స్‌ఫేర్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి సైన్స్‌ఫెర్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మానవుడి బుద్ధి వికాసానికి విజ్ఞానశాస్త్రమన్నారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్, ఎంఈవో లక్ష్మణ్‌నాయక్,పాఠశాల కరస్పాండెంట్ రాజుగౌడ్, మాజీ ఎంపీటీసీలు మద్దూరి పాండు, చెన్నయ్య, అశోక్, నాయకులు చేవెళ్ల స్వామి, రాఘవేందర్, కృష్ణగౌడ్, మహేందర్‌గౌడ్ విద్యార్థులు పాల్గొన్నారు.

అధిక శబ్దం వస్తున్న క్రషర్‌ను మూయించాలి

కేశంపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వేముల్‌నర్వ, దత్తాయపల్లి, ఇప్పలపల్లి గ్రామాల శివారుల్లో ఉన్న క్రషర్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని సోమవారం తహసీల్దార్ మీర్ ఆజం అలీ, కేశంపేట సీఐ నరహరిలకు కాంగ్రెస్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. క్రషర్‌లో బ్లాస్టింగ్ సమయంలో అధిక శబ్దం, దుర్వాసన వస్తున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. దుర్వాసన, శబ్దంతో గ్రామాల ప్రజలు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. క్రషర్‌ను మూసేయించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, రాజేష్, ప్రవీణ్, నరేష్, రాజు ఉన్నారు.

అర్హులందరికీ ఇళ్లు నిర్మిస్తాం


గృహలక్ష్మి సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

నందిగామ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని పేదలందరికీ ఇళ్లు నిర్మిస్తామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం బండకుంట తండాలో గృహలక్ష్మి సర్వేను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇండ్లు మంజూరు చేయాలని ఎవరికీ లంచాలివ్వొద్దని, ఎవరైనా డబ్బు డిమాండ్ చేస్తే వెంటనే తనకు ఫిర్యాదు చేయాలన్నారు. దరఖాస్తుల పరిశీలన తర్వతే ఇండ్లను మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జె.నర్సింహులు, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, బాలరాజు, నర్సింహులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలన్నీ పరిష్కరించాలి

షాద్‌నగర్: విద్యుత్ సరఫరాలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే శంకర్ ట్రాన్స్‌కో అధికారులకు చెప్పారు. క్యాంప్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ మోటార్లకు త్రీఫేజ్ కరెంటు లోఓల్టేజీ లేకుండా చూడాలన్నారు. గృహ వినియోగదారులకూ నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాన్నారు. ఆరు మండలాల్లో విద్యుత్ పరికరాలు అవసరముంటే వెంటనే తనకు చెప్పాలన్నారు. ఎలాంటి పరికారలైనా వెంటనే సమకూర్చుతామన్నారు. కాగా నియోజకవర్గంలో 136 మంది సిబ్బంది అవసరం కాగా 52 మందిమే విధులు నిర్వర్తిస్తున్నామని, సిబ్బంది కొరతతో సేవల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికారులు ఎమ్మెల్యేకు చెప్పారు. త్వరలోనే పోస్టులను భర్తీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. డీఈ శ్యాంసుందర్‌రెడ్డి, ఏడీఈలు సత్యనారాయణ, రవీందర్, ఏఈలు రమేష్‌గౌడ్, శ్రీధర్, ఈశ్వర్, షణ్ముఖ్‌రెడ్డి, రవికుమార్ పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్లు మంజూరు చేయించండి

షాద్‌నగర్ నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలను తీర్చాలని టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీని ఎమ్మెల్యే శంకర్ కోరారు. సోమవారం హైదరాబాద్‌లో సీఎండీకి వినతిపత్రం ఇచ్చారు. అదనంగా సబ్‌స్టేషన్ల ఏర్పాట్లు, సిబ్బంది కొరత, నిధుల కేటాయింపు వంటి సమస్యలపై చెప్పారు.

విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందన

జిల్లా స్థాయి సీఎం కప్-2024లో గెలిచిన విద్యార్థులను ఎమ్మెల్యే శంకర్ సత్కరించారు. క్యాంప్ కార్యాలయంలో పరుగు పందెంలో ప్రతిభ కనబర్చిన కేశంపేట మండలం పాపిరెడ్డిగూడ జెడ్పీ స్కూల్‌కు చెందిన అక్షిత, వర్షిత, నిహారికను అభినందించారు. మండలం ఎంపీడీవో రవిచంద్రరెడ్డి, స్పెషలాఫీసర్ రాజారత్నం, ఎంఈవో చంద్రశేఖర్, హెచ్‌ఎం శ్రీశైలం, ఆనంద్‌బాబు, బాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

పీవీ సేవలు చిరస్మరణీయం

ఆమనగల్లు/కడ్తాల్/తలకొండపల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బహుముఖ ప్రజ్ఞాశాలి, భారత మాజీ ప్రధాని పీవీ.నరసింహారావు వర్ధంతిని సోమవారం ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల్లో నిర్వహించారు. కాంగ్రెస్ మండలాల అధ్యక్షులు జగన్, బిచ్యానాయక్, ప్రభాకర్‌రెడ్డి, మానయ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కడ్తాల్, తలకొండపల్లిల్లో ఎమ్మెల్యే నారాయణరెడ్డి పాల్గొన్నారు. దేశంలో ఆర్థిక సంస్కరణల అమలుకు పి.వి చేసి కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ గీత, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, నర్సింహ, శ్రీనివాస్‌రెడ్డి, కేశవరెడ్డి, బిక్య, రామకృష్ణ, సంపత్ పాల్గొన్నారు.

ప్రతిభాపాటవ పోటీలతో ఉత్సాహం

యాచారం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పరీక్షల సమయంలో వివిధ సబ్జెక్టులపై ప్రతిభాపాటవ పోటీలు నిర్వహిస్తే విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతాయని యాచారం హైస్కూల్ హెచ్‌ఎం నర్సింహ చెప్పారు. పదోతరగతి విద్యార్థులకు సోమవారం ప్రతిభాపాటవ పోటీపరీక్షల ప్రశ్నాపత్రాలను విడుదల చేశారు. విజేతలైన విద్యార్థులను అభినందించారు.

పంటల బీమా స్కీంలను సద్వినియోగం చేసుకోవాలి

లీడ్ బ్యాంక్ జిల్లా అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి


మాట్లాడుతున్న జిల్లా లీడ్ బ్యాంక్ అధికారి లక్ష్మీకాంత్‌రెడ్డి

శామీర్‌పేట, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పంటల బీమా పథకాలను రైతులు వినియోగించుకోవాలని లీడ్ బ్యాంక్ జిల్లా అధికారులు లక్ష్మీకాంత్‌రెడ్డి, సతీశ్ పిలుపునిచ్చారు. సోమవారం శామీర్‌పేట మండలం బొమ్మరాసిపేట గ్రామంలో మండల వ్యవసాయాధికారి రమేశ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ రైతు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అర్హులైన రైతులకు వ్యవసాయ పంట రుణాలను, వ్యవసాయ పనిముట్లను జిల్లా లీడ్ బ్యాంక్ అధికారులు, కెనరా బ్యాంకు శామీర్‌పేట బ్రాంచ్ మేనేజర్ సాగర్ అందజేశారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పట్టా భూములను కలిగి ఉండి సాగు చేస్తున్న రైతులు పంటల బీమా కోసం, అలాగే ప్రమాదవశాత్తు ఆర్థిక సాయం కింద రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీమా పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నాయని వివరించారు. కెనరా బ్యాంక్ శామీర్‌పేట బ్రాంచ్ మేనేజర్ సాగర్ మాట్లాడుతూ సైబర్ మోసాలపట్ల నష్టపోకుండా ఉండేందుకు ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శామీర్‌పేట సీఎఫ్‌ఎల్ కౌన్సిలర్లు రైతులకు, ప్రజలకు వివిధ పథకాల పట్ల అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఎఫ్‌ఎల్ కౌన్సిలర్లు జ్యోతి, శ్రీకాంత్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

శామీర్‌పేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నిత్యం క్రమశిక్షణతో చదివి టెన్త్ పరీక్షల్లో ర్యాంకులను సాధించాలని మాజీ జేడీ లక్ష్మీనారాయణ హితవు చెప్పారు. తూంకుంటలోని మొగుళ్ళ వెంకట్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ట్రస్మా, ఐఎంసీటీఎఫ్, శ్రీవిజ్ఞానభారతి హైస్కూల్ కరస్పాండెంట్ హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన హాజరై విద్యార్థులకు సందేశాన్నిచ్చారు. విద్యార్థులు తల్లిదండ్రులు, గురువులు మెచ్చుకునేలా, సమాజం గర్వపడేలా తయారు కావాలన్నారు. అప్పుడే అత్యుత్తమ పౌరులుగా రాణిస్తారని ఆయన హితవు పలికారు. సోషల్ మీడియా యాప్స్‌కు విద్యార్థులు దూరంగా ఉంటూ పూర్తి శ్రద్ధతో టెన్త్ పరీక్షలకు సిద్ధమై రాస్తే ఉత్తమ ర్యాంకులను సాధించగలుగుతారని వివరించారు. కార్యక్రమంలో ఐఎంసీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామ్మూర్తి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రాములు, ట్రస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు హనుమంతరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపల్ జంగారెడ్డి కిష్టారెడ్డి, లవకుమార్, శివశంకర్, స్వరూప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలూరు గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఆలూరు గ్రామస్తులు, నాయకులు

చేవెళ్ల, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆలూరు గ్రామాన్ని ప్రత్యేక మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే యాదయ్యను కోరారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆలూరుకు చెందిన నాయకులు కె.నర్సింలు, జి. ఆశోక్, కసిరె వెంకటేశ్, తోట చంద్రశేఖర్ తదితరులు మాట్లాడారు. చేవెళ్ల మండలంలోని ఆలూరు గ్రామాన్ని ప్రత్యేక మండల కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని చెప్పారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేవెళ్లను మున్సిపాలిటీగా ఏర్పాటు చేసిందని, ఆలూరు చుట్టుపక్కల ఉన్న గ్రామాలను కలుపుతూ ప్రత్యేక మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం గ్రామంలో 1,200 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించేలా కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రభాకర్, కుమార్, శ్రీనివాస్, శ్రీశైలం, నరేందర్, యాదిరెడ్డి, షబ్బీర్, శేఖర్, నర్సింలు ఉన్నారు.

సీపీఐది అలుపెరుగని పోరాటం


పోస్టర్ ఆవిష్కరిస్తున్న జంగయ్య, తదితరులు

మహేశ్వరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంలో సీపీఐది అలుపెరుగుని పోరాటమని, నిత్యం ప్రజా పోరాటాలతో 99 సంవత్సరాలు పూర్తిచేసుకొని శత వసంతంలోకి అడుగుపెట్టడం సంతోషంగా ఉందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పాల్మాకుల జంగయ్య అన్నారు. ఈమేరకు సోమవారం మహేశ్వరంలో శత వసంతోత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను నాయకులతో కలిసి జంగయ్య ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో దత్తునాయక్, యాదయ్య, దేవేందర్‌గౌడ్, బ్రహ్మాచారి, సత్తయ్య, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పాలనలో విధ్వంసం


రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో చేసిన ఆర్థిక విధ్వంసాన్ని చక్కదిద్దుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను అమలు చేస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కేసీఆర్ పాలనలో పేదల సంక్షేమ పథకాలను అటకెక్కించారని విమర్శించారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల్లో సోమవారం ఎమ్మెల్యే పర్యటించారు. 149 మందికి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. కడ్తాల మండలం నాగిరెడ్డిగూడ తండా నుంచి మక్తమాదారం వరకు రూ.1.2కోట్లతో నిర్మించే రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. బీఆర్‌ఎస్ పాలనలో అప్పుల మూలాంగానే కాంగ్రెస్ కొన్ని పథకాలను చేయడంలో కొంత జాప్యమైతోందన్నారు. ప్రతీ హామీని అమలు చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఆమనగల్లులో మోడల్ ఇళ్ల నిర్మాణంలో జాప్యమైతోందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గానికి 4,500 ఇళ్లు మంజూరయ్యాయని, ఇల్లు లేని ప్రతీ పేదకు ఇల్లు కట్టిస్తామన్నారు. ఆయాచోట్ల జరిగిన కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్‌పర్సన్ యాట గీతనర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్‌చైర్మన్ దుర్గయ్య, తహసీల్దార్లు లలిత, ముంతాజ్, నాగార్జున, మున్సిపల్ కమిషనర్ వసంత, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, వై.నర్సింహ, శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి, జి.కేశవరెడ్డి, ఎంపీడీవోలు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చర్చిల రూపురేఖలు మారుస్తాం


ఎమ్మెల్యే, సబ్ కలెక్టర్‌తో కలిసి ప్రార్థన చేస్తున్న పాస్టర్ జనార్దన్

తాండూరు రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తాండూరు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో శిలావస్థలో ఉన్న చర్చిలన్నింటినీ రాబోయే రోజుల్లో రూపురేఖలు మార్చేస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యాని మనోహర్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గానికి చెందిన క్రైస్తవులతో సోమవారం తాండూరు పట్టణ సమీపంలోని వైట్ ప్యాలెస్‌లో క్రిస్టియేన్ మైనార్టీస్ నియోజకవర్గం అధ్యక్షుడు వి.కిరణ్ ఆధ్వర్యంలో క్రైస్తవుల విందు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేక్ కట్‌చేసి ప్రసంగించారు. నియోజకవర్గంలో రూ.25కోట్లు వెచ్చించి అన్ని చర్చిలను నిర్మించి అభివృద్ధి చేసే బాధ్యత మాదని అన్నారు. ఈ కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, తహసీల్దార్ తారాసింగ్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న, తాండూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటిన విద్యార్థినులు

ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో అంకుశాపూర్‌లోని గురుకుల మహిళాడిగ్రీ కళాశాల(మహేంద్ర హిల్స్) సత్తాచాటారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో జరిగిన రాష్ట్రస్థాయి క్రాస్‌కంట్రీ అథ్లెటిక్స్ 10కిలోమీటర్ల విభాగంలో అనూష 5వస్థానం, చైతన్య 8వ స్థానం, బేబీ 9వ స్థానం, సోనీ 20వ స్థానం సాధించారు. 6 కిలోమీటర్ల అథ్లెటిక్స్ విభాగంలో ఉషారాణి 5వ స్థానం, టాబు 7వ స్థానం, జి.ఉషారాణి 8వ స్థానం, సలోని 23వ స్థానంలో నిలిచి బహుమతులు గెలుపొందారు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ప్రిన్సిపల్ స్నేహలతతో పాటు అధ్యాపకులు, విద్యార్థినులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు స్వరూపరాణి, అనురాధ, జ్యోతి, శివకుమార్, వసంత, పద్మజ, రజిత, ప్రత్యూష, శిరీష, రమ్య, లక్ష్మి, సుప్రియ, సుమలత, అథ్లెటిక్స్ కోచ్ బిక్షపతియాదవ్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ

బొంరాస్‌పేట్: సీఎం కప్ జిల్లా స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో బొంరాస్‌పేట్ మండల క్రీడాకారులు ప్రతిభ కనబర్చారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో బాలుర విభాగంలో బొంరాస్‌పేట్ మండల క్రీడాకారులు నర్సింహులు, శ్రీశైలం, అశోక్, మహేశ్, ప్రభాకర్, గంగాధర్, మల్లేశ్, రాహుల్, అఖిలేశ్, రాఘవేందర్, ప్రవీణ్, మహబూబ్‌లు మొదటి స్థానంలో నిలిచారు. వారికి జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేశారు.

నాలుగు నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పశువులకు అత్యవసర వైద్య సేవలు అందించే పశుసంచార వాహన సిబ్బందికి నాలుగు నెలలుగా వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామంటూ మేడ్చల్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వని కారణంగా పూట గడవటం కష్ట తరంగా మారిందని వారు ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు వేతనాలు అందజేయాలని కోరారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌కు సన్మానం

దోమ/కులకచర్ల, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కులకచర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.ఆంజనేయులును సోమవారం మండల కేంద్రంలో ఏబీబీఎస్ జిల్లా సేవాలాల్ సేన కుల్దీప్‌సింగ్, మండల యూత్ అధ్యక్షుడు జంగయ్య శాలువాతో సన్మానించారు.

ధ్యానంతో ఆత్మజ్ఞానం

(5వ పేజీ తరువాయి)

ధ్యాన విలువలను వివరించారు. ఈమేకు ఆదాయ పన్ను శాఖ అధికారి జైన్ వేడుకలకు హాజరై ధ్యాన విస్తరణకు చేస్తున్న కృషిని అభినందించారు. పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు సాంబశివరావు, హన్మంతరావు, మాధవి, దామోదర్‌రెడ్డి, లక్ష్మి, అన్మాస్‌పల్లి మాజీ సర్పంచ్ శంకర్, పీఎస్‌ఎస్‌ఎం అధ్యక్షులు సరోజ, తదితరులు పాల్గొన్నారు. ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు ధ్యానమహాయగంలో భాగంగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరిస్తున్నాయి. ఆధ్యాత్మిక వేత్తల ప్రసంగాలు ఆకట్టుకుంటున్నాయి. ధ్యాన, శాఖాహార విలువల గురించి పలువురు పిరమిడ్ మాస్టర్లు ధ్యాన వేడుకల్లో వివరించి అవగాహన కల్పిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆధ్యాత్మిక వేత్తలు పిరమిడ్‌ను సందర్శించి ధ్యాన మహాయాగంలో పాల్గొన్నారు. పలు ప్రాంతాల కల్చరల్, అకాడమీలకు చెందిన కళాకారుల నృత్యాలు, కళాప్రదర్శనలు అందరినీ అమితంగా ఆకట్టుకున్నాయి. చిన్నారులు, యువతులు, కళాకారుల నృత్యరూపకాలు, భరత నాట్యాలు, కూచిపూడి నృత్యాలు అదరహో అనిపించాయి. కామాక్షి బృందంచే నిర్వహించిన సంగీత కార్యక్రమం అలరించింది.


ఆకట్టుకున్న సంజయ్‌కింగ్ సంగీతనాద ధ్యానం


ధ్యాన పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆధ్యాత్మికవేత్తలు, పిరమిడ్ ట్రస్ట్ సభ్యులు

పలు పుస్తకాల ఆవిష్కరణ

ధ్యాన మహాయాగంలో భాగంగా పిరమిడ్ సభా ప్రాంగణంలో పలు ధ్యాన, ఆధ్యాత్మిక పుస్తకాలను పిరమిడ్ ట్రస్ట్ చైర్మన్ కోర్పోలు విజయభాస్కర్ రెడ్డి, పత్రీజీ కూతురు పరిణిత పత్రిజీ ఆవిష్కరించారు. ధ్యాన విలువలను చాటుతూ పుస్తకాలను వెలువరిస్తున్న రచయితలను ఈ సందర్భంగా వారు అభినందించారు. అదేవిదంగా పలు ధ్యాన కేంద్రాల ద్వారా రూపొందించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు.

ఇందిరమ్మ సర్వే పక్కాగా చేపట్టాలి

చౌదరిగూడ/మొయినాబాద్ రూరల్,డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల ఆన్‌లైన్ నమోదును పక్కాగా చేపట్టాలని జిల్లేడ్ చౌదరిగూడ ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ సూచించారు. సోమవారం గాలిగూడ, పీర్జపూర్, ముష్టిపల్లి తదితర గ్రామాల్లో ఇళ్ల ఆన్‌లైన్ నమోదును పరిశీలించారు. అలాగే కొందుర్గు మండలం ఉమ్మెంత్యాల, కొందుర్గు, చిన్న ఎల్కిచర్ల గ్రామాల్లో ఎంపీడీవో లక్ష్మీఅనురాధ నమోదును పర్యవేక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆన్‌లైన్ సర్వర్ సమస్య కారణంగా ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు ఇందిరమ్మ కమిటీ సభ్యుల సహకారంతో నమోదును వేగవంతం చేయాలని పీఎస్‌లకు సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం నరసింహ, ఏఈవో స్వాతి, పీఎస్‌లు సమత, పాండురంగంగౌడ్, సౌజన్య, నాయకులు, శశిధర్, సత్యయ్య, బాలయ్య, ప్రభాకర్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నమోదును జాగ్రత్తగా చేయాలని మొయినాబాద్ ఏవో అనురాధ అన్నారు. హిమాయత్‌నగర్‌లో సర్వే చేస్తున్న సెక్రటరీ సంధ్యారాని, అంగన్‌వాడీలకు సూచనలు చేశారు. ఈ నెల 30వ తేదీకల్లా సర్వే పూర్తి చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపికకు చేపట్టే సర్వేను జాగ్రత్తగా చేయాలని చెప్పారు. ఎలాంటి ఒత్తిళ్లకు లొంగవద్దని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, కవిత, కారోబార్ శ్రీనివాస్‌గౌడ్ ఉన్నారు.

పంటల రక్షణకు సోలార్ ఫెన్సింగ్




చేవెళ్లలో రైతులు పొలాల వద్ద బిగించిన సోలార్ ఫెన్సింగ్, సోలార్ ఫలకం

- తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం
- తగ్గిన వన్యప్రాణుల బెడద
- ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలని కోరుతున్న రైతులు

చేవెళ్ల, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పగలు, రాత్రి తేడా లేకుండా వన్య ప్రాణులు పంటలపై పడి పాడుచేస్తున్నాయి. దీంతో దిగుబడి తగ్గి రైతులు నష్టపోతున్నారు. దీంతో పంటలకు కాపాడుకునేందుకు రైతులకు సోలార్ ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. దీనితో ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో వాటి ఏర్పాటుకు ఆసక్తి చూపుతున్నారు. చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్ మండలాల్లో భూములకు సమీపంలో అటవీ ప్రాంతం లేకున్నా అడవి పందుల బాగా వస్తున్నాయి. పత్తి, కంది, శనగ, మొక్కజొన్న, జొన్న, కూరగా పంటలపై ధ్వంసం చేస్తున్నాయి. వాటి బారి నుంచి పంటల రక్షణకు గతంలో రైతులు విద్యుత్ వైర్లు వేసేవారు. ఈ విధానంతో కొన్న పశువులు, కొన్నిసార్లు మనుషులు చనిపోయారు. వన్య ప్రాణులూ మృత్యువాత పడ్డాయి. అడవి పందుల నుంచి పంటలను కాపాడుకునేందుకు చాలా మంది రైతులు సోలార్ కంచెలు ఏర్పాటుచేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

పదెకరాలకు రూ.14వేల ఖర్చు

సోలార్ ఫెన్సింగ్ షాక్‌కొట్టినా మనుషులకు, పశువులకు, వన్య ప్రాణులకు ప్రాణహాని ఉండదు. జల్ మన్నట్టు అన్పిస్తుంది. దీంతో పందులు బెదిరి పారిపోతాయి. 8 నుంచి 10ఎకరాల ఫెన్సింగ్‌కు రూ.9వేల నుంచి రూ.14వేల ఖర్చు వస్తుంది. ఒక్కసారి పోలార్ ఫెన్సింగ్ వేసుకుంటే కొన్నేళ్లు పనిచేస్తుంది.

రూ10వేలు ఖర్చుచేశా



నా 7ఎకరాల పంట చేను చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసుకున్నా. రూ.10వేలు ఖర్చు చేశాను. గతంలో మొక్కజొన్న, క్యారెట్, క్యాబేజీ పంటల్లో అడవి జంతువులు పడి పంటను నాశనం చేసేవి. అవి తినేకన్నా ఎక్కువగా తొక్కిపాడు చేసేవి. ఇప్పుడు సోలార్ ఫెన్సింగ్‌తో వన్యప్రాణుల బెడద తగ్గింది. అన్ని రకాల పంటల చుట్టూ సోలార్‌కంచె వేసుకోవచ్చు. తక్కువ ఖర్చుతో పంటలకు రక్షణగా ఉంటోంది.

- పెంజర్ల అనంత్‌రెడ్డి, రైతు చేవెళ్ల

మత విద్వేషాలు లేని సమాజాన్ని నిర్మించుకోవాలి



క్రిస్మస్ కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): క్రీస్తు ప్రబోధించినట్టు మత విద్వేషాలు లేని సమాజాన్ని నిర్మించుకుందామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం షాద్‌నగర్‌లోని ఓ ఫంక్షన్ హాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్‌చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సర్వ మానవ సమానత్వం, శాంతి, సాహసం, ప్రేమ, కరుణ అనే సందేశాన్ని ఇచ్చిన క్రీస్తు బాటలో అందరం నడుచుకోవాలన్నారు. క్రైస్తవులు క్రిస్మస్ పండుగను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే షాద్‌నగర్ శివారులోని ఎఫ్‌సీఎన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ నరేందర్, ఏఎంసీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, ఎఫ్‌సీఎన్ సంస్థ నిర్వాహకులు గీతాథామస్, కాంగ్రెస్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, బాలరాజు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి



తిమ్మారెడ్డిగూడ బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

షాబాద్, డిసెంబరు 23: గ్రామాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామ సమీపంలో ఈసీ వాగుపై రూ.5కోట్లతో నిర్మించిన బ్రిడ్జిని పరిశీలించారు. త్వరలోనే బ్రిడ్జిని ప్రారంభిస్తామన్నారు. ఏట్ల ఎర్రవల్లి వద్ద ఈసీ వాగుపై మంజూరైన బ్రిడ్జి త్వరలోనే పనులు ప్రారంభించేలా చూస్తామన్నారు. తిమ్మారెడ్డిగూడ అనుబంధ గ్రామమైన వెంకమ్మగూడను గ్రామపంచాయితీగా ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల అభివృద్ధికి తనవంతు సహాయ, సహకారం అందిస్తామని ఆయన అన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలుస్తాం

ఇటీవలే అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికొచ్చిన పీఏసీఎస్ వైస్ చైర్మన్ మద్దూర్ మల్లేష్‌ను ఆయన పరామర్శించి, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైరన్ పీసరి సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీలు మద్దూర్ పాండు, కుమ్మరి చెన్నయ్య, నాయకులు వెంకట్‌రెడ్డి, చేవెళ్ల స్వామి తదితరులు ఉన్నారు.

తుమ్మలూరు-మహేశ్వరం రోడ్డు పనులు పూర్తిచేయాలి



రోడ్డు పనులపై అధికారులనడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి):తుమ్మలూరు- మహేశ్వరం రోడ్డు విస్తరణ పనుల్లో తీవ్రజాప్యం జరుగుతోందని, దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. సోమవారం రోడ్డు పనులను ఆమె పరిశీలించి అధికారులతో మాట్లాడుతూ.. రోడ్డు పనుల్లో వేగంగా చేసి త్వరలో పూర్తి చేయాలన్నారు. ఏడాది కాలంగా రోడ్డు విస్తరణ పనుల్లో జరుగుతున్న జాప్యంతో ప్రజలు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతతున్నారన్నారు.వెంటనే కాంట్రాక్టర్ రోడ్డు పనులను పూర్తిచేయాలన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మంజూరైన నిధులను కాంగ్రెస్ ప్రభుత్వం నిలిపివేయడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు నిలిచాయని వాపోయారు. ప్రభుత్వం వెంటనే అభివృద్ధి పనులకు నిధులను విడుదల చేయాలన్నారు. అదే విధంగా తుమ్మలూరు ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం, అలాగే విద్యా బోధన ఎలా చేస్తున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట అధికారులు, బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, నవీన్, చంద్రయ్య, శ్రీధర్‌రెడ్డి, రాజు, శ్రీహరి, ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

సామాజిక సేవల్లో ప్రతి ఒక్కరు పాలుపంచుకోవాలి



మందులందజేస్తున్న గంప వెంకటేశ్, దశరథ్‌నాయక్, వెంకోబా

కడ్తాల్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవల్లో ప్రతి ఒక్కరు పాలు పంచుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ జి.వెంకటేశ్, లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, దశరథ్‌నాయక్, కర్కల్‌పహాడ్ మాజీ సర్పంచ్ నాగమణివెంకోబా, మాజీ ఎంపీటీసీ లచ్చిరామ్‌నాయక్ అన్నారు. పేదలకు ఉచిత వైద్యంఅందించేందుకు ప్రైవేట్ ఆసుపత్రులు ముందుకు రావాలని కోరారు. కర్కల్‌పహాడ్‌లో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 155మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సేవ్యానాయక్, యాదయ్య, మహేశ్, రాజు, అర్జున్, బుచ్చిబాబు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం

నందిగామ, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మహిళా అభివృకి తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తోందని జిల్లా అదనపు కలక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. సోమవారం చేగుర్, అంతిరెడ్డిగూడల్లో ఇందిర మహిళా శక్తి ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను పరిశీలించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు చేపడుతున్న మైక్రో ఎంటర్‌ప్రైజెస్, డైరీ పార్లర్, ఎంబ్రాయిడరీ యూనిట్లను ప్రతిమాసింగ్, డీఆర్‌డీవో, డీఆర్‌డీఏ అధికారులతో ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా అధికారులు శ్రీలత, సూర్యారావు, బాల్‌రాజ్, యాదగిరి, అనురాధ, అరుణ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మహేంద్రకుమార్‌రెడ్డికి లీడర్‌షిప్ అవార్డు

కందుకూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కందుకూరు లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు, జిల్లా ఫస్ట్ వైస్‌గవర్నర్ లయన్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ లీడర్‌షిప్ మెడల్‌ను అందుకున్నారు. హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో 17 దేశాల ప్రతినిధులు హాజరైన లయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ పెట్రీషియో చేతులు మీదుగా మెడల్‌ను అందుకున్నారు. మహేంద్రకుమార్‌రెడ్డి మాట్లాడారు. ఇది లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్‌లో ఇచ్చే అత్యుత్తమ మెడల్ అన్నారు. లయన్స్ క్లబ్ ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించడంతో తనకు ఈ అరుదైన గౌరవం దక్కిందన్నారు. అలాగే జిల్లాలో సేవా కార్యక్రమాలను చేపట్టేందుకు తన వంతు కృషి చేస్తానని అన్నారు. తనకు మెడల్ వచ్చేందుకు సహకరించిన లయన్స్ క్లబ్ సభ్యులందరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ ఫస్ట్ వైస్ ప్రెసిడెంట్ ఏపీ.సింగ్, కందుకూరు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సురసాని విఠల్‌రెడ్డి, జిల్లా అదనపు కార్యదర్శి తాళ్ల అంజయ్య, మాజీ అధ్యక్షులు బి. రాంరెడ్డి, దీపారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అవార్డును అందుకుంటున్న డాక్టర్ జి.మహేంద్ర కుమార్‌రెడ్డి

రైతులు రుణ బకాయిలు చెల్లించాలి



సొసైటీలో రుణ బకాయి చెల్లిస్తున్న రైతు

యాచారం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పాత రుణ బకాయిలు చెల్లించి తోటి రైతులకు కొత్త రుణాలిచ్చేలా సహకరించాలని జిల్లా సహకార సంఘం జాయింట్ రిజిస్ట్రార్ సూర్యచందర్‌రావు, లీగల్ అధికారి డి.లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. అప్పు కట్టకుంటే సెక్షన్ 71 కింద ఆస్తులను జప్తు చేస్తామని అన్నారు. సోమవారం యాచారం, చింతపట్ల, నందివనపర్తి, మాల్, మేడిపల్లి గ్రామాల రైతులను కలిసి బకాయిలు చెల్లించాలని కోరారు. మండలంలో రూ.పది కోట్ల బకాయిలున్నాయని తెలిపారు. కనీసం రూ.5కోట్ల బకాయిలైనా వసూలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. చౌదర్‌పల్లి, దర్మన్నగూడల రైతులు రూ.5లక్షల బకాయిలు చెల్లించారు. సీఈవో నాగరాజు, మహేష్, గణేష్ ఉన్నారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలి

ఆమనగల్లు, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటోందని టాస్క్ సీఈవో, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుపోవాలని పిలుపునిచ్చారు. ఆమనగల్లు మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కృష్ణయాదవ్‌కు సోమవారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాఘవేందర్‌రెడ్డి పాల్గొని ఆయనను పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. కాంగ్రెస్ ప్రజా పాలనలో ప్రతి ఒక్కరికి మేలు జరుగుతుందన్నారు. అసమానతలను రూపుమాపి అందరికీ సమన్యాయం చేయాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి ధ్యేయమన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరిస్తాం



కందుకూరు: ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

చేవెళ్ల/ఇబ్రహీంపట్నం/కందుకూరు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటవెంటనే పరిష్కరిస్తామని చేవెళ్ల ఆర్డీవో చంద్రకళ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో 23 ఫిర్యాదులు వచ్చినట్టు చెప్పారు. ధరణి, పింఛన్లు, రుణమాఫీ వంటి సమస్యలపై ఫిర్యాదులు చేశారన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో రాజశేఖర్, అధికారులు, సిబ్బంది ఉన్నారు. ఇబ్రహీంపట్నం మండల పరిషత్‌లో ప్రజావాణి కార్యక్రమంలో 18 దరఖాస్తులొచ్చినట్లు ఆర్డీవో కె.అనంతరెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు కొంగరకలాన్‌లోని కలెక్టరేట్‌లో ప్రజావాణి దరఖాస్తులిచ్చేవారని, ఇప్పుడు డివిజన్ స్థాయిలోనే దరఖాస్తులు తీసుకుంటున్నామని అధికారులు చెప్పారు. ఇబ్రహీంపట్నం, యాచారం ఎంపీడీవోలు వెంకటమ్మ, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు. కందుకూరు ఆర్డీవో కార్యాలయంలో ప్రజావాణికి 13అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో కె.జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. వాటిని తహసీల్దార్ ఆఫీసులకు పంపి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, అఫ్జల్‌బేగ్, రైతులు పాల్గొన్నారు.

రైతు దేశానికి వెన్నెముక

షాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రైతు దేశానికి వెన్నెముక అని సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ అన్నారు. రైతు దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మండల పరిధిలోని రేగడిదోస్వాడలో రైతులకు నూనుగింజల సాగు, కూరగాయల సాగు, వరిసాగు, పాడిపరిశ్రమలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతు బాగుంటే దేశం బాగుంటుందన్నారు. సాంకేతిక పద్ధతులతో వ్యవసాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో భారతీయ నూనెగింజల సంస్థ టెక్నీషియన్ నందీశ్వర్, రైతులు మధుసూదన్‌రెడ్డి, చంద్రారెడ్డి, మాధవరెడ్డి, నర్సింహారెడ్డి, మల్లారెడ్డి, మల్లయ్య పాల్గొన్నారు.

ఆమనగల్లు: రైతే దేశానికి వెన్నెముక అని డీసీసీబీ డైరెక్టర్, పీఏసీఎస్‌చైర్మన్ గంపవెంకటేశ్ అన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయరంగం అబివృద్ధికి ప్రభుత్వాలు పెద్దపీట వేయాలని కోరారు. ఆమనగల్లు పీఏసీఎస్ కార్యాలయం వద్ద జాతీయ రైతు దినోత్సవాన్ని జరుపుకున్నారు. మున్సిపల్ కౌన్సిలర్ కమటం రాధమ్మవెంకటయ్య, ప్యాక్స్ డైరెక్టర్లు, పలువురు రైతులతో కలిసి వెంకటేశ్ కేక్ కట్‌చేసి ప్రజలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో డైరెక్టర్లు దోశ్యానాయక్, శ్రీపాల్, వెంకటేశ్, యాదయ్య, జంగయ్య, గన్యానాయక్, రూప్‌సింగ్, రాజేశ్, యాదమ్మ, రాములమ్మ, సీఈవో దేవేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

● **మొయినాబాద్ రూరల్:** ప్రభుత్వ భూమిని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తోలుకట్ట గ్రామస్తులు కోరారు. సోమవారం డిప్యూటీ తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామస్థుడు శివశంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. తోలుకట్టలోని సర్వే నంబర్ 108, 143లోని ప్రభుత్వ భూమి 11 ఎకరాల వరకు ఉందని, నగరానికి చెందిన అఫ్రాన్ అనే వ్యక్తి నకిలీపత్రాలు సృష్టించి బోరు వేసి నిర్మాణాలు చేపడుతున్నాడని తెలిపారు. అడిగేందుకు వెళ్తున్న గ్రామస్తులపై కుక్కలను ఉసిగొల్పుతూ భయపెడుతున్నాడని తెలిపారు. ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. డీటీని కలిసిన వారిలో రవీందర్ రెడ్డి, కుమ్మరి రమేష్, సురేందర్‌రెడ్డి, రాజుగౌడ్, చాకలి యాదయ్య, కనకమామిడి నవీన్ ఉన్నారు.

యాచారం: మాల్ నుంచి నల్లవెల్లికి వెళ్లే దారిని కొందరు ఆక్రమిస్తున్నారని. ఆక్రమణతో రోడ్డు ఇరుకుగా మారుతోందని నల్లవెల్లి గ్రామస్తులు తహసీల్దారు అయ్యప్పకు వినతి పత్రం ఇచ్చారు. కబ్జాదారులు తమ ప్లాట్ రోడ్డు వరకుందని రోడ్డు ను ఆక్రమిస్తున్నారని తెలిపారు. రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారు లు రోడ్డును విచారించి ఆక్రమణను అడ్డుకోవాలని వి నతిలో కోరారు. రోడ్డు ఆక్రమిస్తే భవిష్యత్తులో రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని గ్రామస్తులు అన్నారు. తక్షణమే ఆక్రమణను అడ్డుకోవాలని తహసీల్దార్‌ను కోరారు. రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోవాలన్నారు.

● **షాబాద్:** విద్యార్థులు శ్రీనివాసరామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈవో లక్ష్మణ్‌నాయక్ అన్నారు. షాబాద్ మండలంలోని సర్దార్‌నగర్ ఉన్నత పాఠశాలలో, మాంటిసోరీ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శ్రీనివాస రామానుజన్ భారతదేశం గర్వించదగ్గ గొప్ప గణితశాస్త్ర వేత్త అని అన్నారు. రామానుజన్ దేశానికే ఆదర్శప్రాయుడని, నేటి తరానికి గొప్ప మార్గదర్శకులని కొనియాడారు. విద్యార్థులు గణితశాస్త్రన్ని కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలని సూచించారు. విద్యార్థులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాంటిసోరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **యాచారం:** యాచారం మండల ట్రాన్స్‌కో ఏఈ పోస్టు గత మూడు నెలలుగా ఖాళీగా ఉంది. గత మూడు నెలలుగా సబ్‌ఇంజనీర్ తోనే కార్యక్రమాలు సాగిస్తున్నారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఏఈ సందీప్‌కుమార్ నగరానికి బదిలీ కావడంతో ఏఈ పోస్ట్‌ఖాళీగా ఉంది. మండలంలో తమ్మలోనిగూడ, గున్‌గల్, చిన్నతూండ్ల, తాటిపర్తి, మంతన్‌గౌరెల్లి, తక్కళ్లపల్లి, నందివనపర్తి, యాచారం, మేడిపల్లి గ్రామాల్లో 33/11కేవీ సబ్‌స్టేషన్లున్నాయి. వాటిని మెయింటేన్ చేయడానికి సబ్ ఇంజనీర్‌కు తలకుమించిన భారంగా మారింది. నెలనెలా బిల్లులు వసూలు చేయడం, లైన్ల తనిఖీ, సబ్‌స్టేషన్ల మరమ్మతు తదితర వాటిని చేసేందుకు సబ్ ఇంజనీర్లు నానా ఇబ్బందుల పాలవుతున్నారు. ట్రాన్స్‌కో ఉన్నతాధికారులు స్పందించి ఏఈని నియమించాలని మండల వాసులు కోరుతున్నారు.

రఘుకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

ఆమనగల్లు, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు తెలంగాణ ఉద్యమకారుడు ఎంగలి రఘును కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పరామర్శించారు. రఘు తల్లి సుశీల ఇటీవల మృతిచెందారు. సోమవారం ఆమనగల్లులోని ఆయన నివాసంలో జైపాల్ సుశీలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. రఘుతో పాటు ఆయన సోదరులు బాలకృష్ణయ్య, యాదగిరి, శ్రీనివాస్, రమేష్‌లను పరామర్శించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు నేనావత్‌పత్యనాయక్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఎన్.శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకుడు ఉప్పల రాములుయాదవ్, బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు వడ్డె వెంకటేష్, వార్డు మాజీ సభ్యులు వస్పుల సాయిలు, ఎంగిలి శ్రీధర్, యాదయ్య, మహేష్, బయ్యు దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.



చిత్రపటం వద్ద నవాళులర్పిస్తున్న జైపాల్‌యాదవ్ తదితరులు

క్రైం కార్నర్

చెరువులో పడి మహిళ ఆత్మహత్య



సంతోష(ఫైల్)

కొత్తూర్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జీవితం మీద విరక్తితో ఓ మహిళ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మున్సిపాలిటీలోని గోధుమకుంట చోటు చేసుకుంది. ఏఎస్ఐ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం... ఫాతిమాపూర్ ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి వద్ద సంతోష(28) కూలి పనిచేస్తూ పిల్లలతో ఒంటరిగా ఉండేది. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సంతోష ఈ నెల 21న ఇంటి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం కుటుంబీకులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. సోమవారం గోధుమకుంట చెరువులో ఆమె మృతదేహం కన్పించింది. పోలీసులు చేరుకొని మృతదేహాన్ని వెలికి తీసి పోస్టుమార్టం కోసం షాద్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. సంతోష సోదరి శాంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగింత



ఎస్సై రామకృష్ణ, తండ్రి వెంకటేష్‌తో సాయి

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధి కప్పాడులో ఆగస్టు 14న తప్పిపోయిన 16ఏళ్ల బాలుడిని పోలీసులు వెతికి సోమవారం తల్లిదద్రులకు అప్పగించారు. కప్పాడుకు చెందిన చేతాల అండాలు-వెంకటేష్ దంపతుల కుమారుడు సాయి(16) మతిస్థిమితం లేక బాధపడుతున్నాడు. ఆగస్టు 14న ఇంటినుండి ఎటో పోయాడు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లిదండ్రులు ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేశారు. చివరకు సాయిని కర్ణాటకలోని బీదర్ వద్ద గుర్తించి తేలుకొచ్చి తల్లిందద్రులకు అప్పగించామని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

తమ్ముడిని చంపిన అక్కకు జైలు



అరుణ

షాబాద్, డిసెంబరు23(ఆంధ్రజ్యోతి): ఆస్తి కోసం తోడబుట్టిన తమ్ముడిని కొట్టిచంపిన అక్కకు జిల్లా కోర్టు సోమవారం యావజ్జీవ జైలుశిక్ష విధించింది. ఈ కేసుకు సంబంధించి షాబాద్ ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బోడంపహాడ్‌కు చెందిన అమ్మాపురం నర్సింహులుకు కూతురు అరుణమ్మ, కొడుకు బాల్‌రాజ్ ఉన్నారు. అరుణకు పదేళ్ల క్రితం కంకల్‌కు చెందిన కర్రె లక్ష్మయ్యతో వివాహమైంది. బాల్‌రాజ్‌కు లక్ష్మితో పెళ్లయింది. అయితే తండ్రి ఆస్తిలో వాటా ఇవ్వాలని అరుణ 2014 మార్చి 3న తమ్ముడితో గొడవపడింది. తండ్రి నర్సింహులు కూడా కూతురికే మద్దతిచ్చి ఇద్దరూ కలిసి బాల్‌రాజ్‌పై దాడిచేశారు. తీవ్రంగా గాయపడిన బాల్‌రాజ్‌ను ఉస్మానియాకి తరలించగా చికిత్స పొందుతూ చనిపోయాడు. బాల్‌రాజ్ భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశామన్నారు. నర్సింహులు ఇప్పటికే చనిపోగా అరుణకు కోర్టు యావజ్జీవ జైలు, రూ.5వేల జరిమానా విధించిందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

బైక్, రెండు బ్యాటరీల అపహరణ

కొత్తూర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కొత్తూర్‌లో ఆదివారం రాత్రి దొంగలు చోరీలు చేశారు. కొత్తూర్‌తండాలో సయ్యద్ అజ్మత్ ఇంటి వద్ద బైక్ పార్క్ చేశాడు. సోమవారం ఉదయం చూసేసరికి బైక్ లేదు. దొంగలు బైక్‌ను ఎత్తుకపోయారు. అలాగే తహసీల్దార్ కార్యాలయం వెనుక ఓ ఇంట్లో అద్దెకుంటున్న బండిరాము తన రెండు లాజిస్టిక్స్ ఆటోలను ఇంటి వద్ద పార్క్ చేశాడు. రెండు ఆటోల బ్యాటరీలను సైతం దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు.

కుక్కల దాడిలో 17 గొర్రె పిల్లలు మృతి



చనిపోయిన గొర్రె పిల్లలు

చౌదరిగూడ, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో గొర్రెల పిల్లలు మృతిచెందిన ఘటన కొందుర్గు మండలంలో సోమవారం చోటుచేసుకుంది. రేగడి చిల్కమర్రికి చెందిన చంద్రయ్య తన గొర్రెపిల్లలను దొడ్డిలో ఉంచాడు. దొడ్డిలోకి కుక్కలు దూరి గొర్రె పిల్లలను కొరికి చంపేశాయి. 17 గొర్రెపిల్లలు మృతి చెందాయని చంద్రయ్య వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు

ఉద్యమకారుల ఫోరం జిల్లా కన్వీనర్‌గా రమేష్



కేశంపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా కన్వీనర్‌గా కాకునూర్‌కు చెందిన సీమల రమేష్ కురుమ నియమించారు. ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు చీమ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డిల ఆధ్వర్యంలో జిల్లా కన్వీనర్‌గా రమేష్‌ను నియమిస్తూ గ్రేటర్ హైదరాబాద్ కార్యాలయంలో సోమవారం నియమాకపత్రం అందించారు.

రైఫిల్ షూటింగ్‌లో న్యాయవాదికి మెడల్



సిల్వర్ మెడల్‌తో రజ్జాక్ హుస్సేన్

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌కు చెందిన సీనియర్ న్యాయవాది రజ్జాక్ హుస్సేన్ రైఫిల్ షూటింగ్‌లో సిల్వర్ మెడల్ సాధించారు. మధ్యప్రదేశ్ రాజధాని భూపాల్‌లో ఈ నెల 18 నుంచి 22 వరకు జరిగిన 67వ నేషనల్ చాంపియన్‌షిప్ 50 మీటర్ల రైఫిల్ షూటింగ్‌లో ప్రతిభను కనపర్చి సిల్వర్ మెడల్‌ను సాధించారు. షూటింగ్‌లో మెడల్ సాధించిన రజ్జాక్‌కు సోమవారం తోటి న్యాయవాదులు, పట్టణ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.

అనాథలకు చేయూతనివ్వడం అభినందనీయం

చేవెళ్ల/శంకర్‌పల్లి, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు తోచిన సాయం అందించాలని ఐబీఎస్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ విజయలక్ష్మి అన్నారు. సోమవారం శంకర్‌పల్లి మండలం ప్రొద్దటూర్‌లోని వాల్మీకి గురుకుల పాఠశాల అనాథ పిల్లలకు యూనివర్సిటీ ఆధ్వర్యంలో దస్తులు, మిటమిన్ మందులందజేశారు. అలాగే కొండకల్‌లోని పాఠశాల విద్యార్థులకు ఆరోగ్యం, పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించారు.

టార్గెట్ 100శాతం

(5వ పేజీ తరువాయి)

ఇస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులు కూడా మంచి మార్కులు సాధించేలా తర్ఫీదిచ్చేలా ఉపాధ్యాయులను సన్నద్ధం చేస్తున్నారు.

అదనపు తరగతుల నిర్వహణ

పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించే ప్రణాళికలో భాగంగా రోజూ ఉదయం 8 నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం ఒక సబ్జెక్టు, సాయంత్రం మరో సబ్జెక్టును చదివిస్తున్నారు. సెలవు రోజుల్లోనూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వర[illegible] వెనుకబడిన సబ్జెక్టులపై ఎక్కువ దృష్టి పెడుతున్నారు.

లక్ష్యం కోసం.. నిర్లక్ష్యంగా!

పదో త[illegible]

[illegible] లేదు.

[illegible]



[illegible] రోజూ పాఠశాలలను తనిఖీ చేస్తాం. [illegible] చౌదరిగూడ మండలం